




# సెల్యూట్

## ఆనందరావు పట్నాయక్

ఎల్.టి.సి. మీద నేను ఫ్యామిలీతో బొంబాయి వెళ్ళాను. లాడ్జిలో దిగిన తర్వాత నా మిత్రుడికి ఫోన్ చేసి మేం వచ్చిన సంగతి చెప్పేను. మర్నాడు పదింటికి. గది తలుపులు టక్ టక్‌మన్నాయి. 'కమిన్' అన్నాను. తెల్లటి ఫ్యాంట్ అంతకన్నా తెల్లగా ఉన్న షర్ట్ టక్‌చేసి చేతిలో టోపీ పట్టుకొని ఒక వ్యక్తిలోనికి వచ్చాడు. క్రాపు పొట్టిగా కత్తిరించి వుంది. 'ఎవరూ' అని తేరిపార చూస్తే మా విస్సూ గాడే. నా ఫోనందుకొని నా రూం వెతుక్కొని వచ్చాడు. వాడుద్యోగం చేసేది నేవీలో. ఎల్.ఎల్.బి. చదివి రిక్తామిగా తిరిగే విస్సుని అదృష్టం వరించి అందలం యెక్కించింది. బొంబాయిలో ఐ.ఎన్.ఎస్.లో అడ్వకేటు గా వుంటున్నాడు.

బొంబాయిలో చూడవల్సినవన్నీ చూసేసాం. చివరిరోజున వాడి ఆఫీసుకి వెళ్ళాం. కొలాబాలో లయన్స్‌గేటు. సెక్యూరిటీ వాళ్ళు ఆదరంగా లోనికి తీసుకువెళ్ళారు. విస్సు కాస్త బిజీగా ఉన్నా అరగంటలో పని ముగించేసుకుని మమ్మల్ని షిప్ చూపించడానికి తీసుకువెళ్ళాడు. ఐ.ఎన్.ఎస్. విక్రాంత్ యుద్ధనౌక. దానికో చరిత్ర వుంది. జీపులోంచి దిగి షిప్‌లోకి వెళ్తూంటే నేవీస్టాఫ్ సైనిక వందనం చేసేరు. విస్సుకి యింత గౌరవం చూసి విస్తుపోయి, సరదా పడ్డాను. షిప్ మీదున్న డెక్, వాటిమీద విమానాల విన్యాసం యెలా జరుగుతుందో వివరించి చెప్పాడు. మావాడు షిప్ లోపల బాత్‌రూం, పార్టీలు జరిగే చోటు చూపిస్తూ మమ్మల్ని సబ్ మెరీన్ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

'సాగరసింధు' సబ్‌మెరీన్ నీళ్ళ మీద తేలి వుంది. విస్సు ఆగిపోయేడు. సబ్‌మెరీన్ చీఫ్ కన్పించాడు. ఇద్దరూ తెలుగువాళ్ళే. 'ప్లీజ్! గో ఎహెడ్, నేను మాట్లాడుతుంటాను' అని చెప్పి ఆర్డర్లీని ఇచ్చి మమ్మల్ని పంపించాడు. నిచ్చెన మీదుగా సబ్‌మెరీన్ ఎక్కి నిల్చున్నాం. యూనిఫాంలో వున్న సబ్‌మెరీన్ స్టాఫ్ నిలబడ్డారు. ఒకడు బిగుల్ ఊదాడు. మిగతావాళ్లు సెల్యూట్ చేస్తూ నిలబడ్డారు. అప్పటికీ చూశాను. వెనక విస్సుగాని, చీఫ్ గాని వస్తున్నారా అని. వాళ్ళు రావడం లేదు. నాకు వళ్లు పులకరించింది. సెల్యూట్‌కి స్పందిస్తూ నేను సెల్యూట్ చేశాను. సబ్ మెరీన్‌ని జీవితంలో చూడ్డం అదే మొదటిసారి. యింత పెద్దదిగా ఉంటుందనుకోలేదు. లోపల హాస్పిటల్, డైనింగుహాలు, స్టాఫ్ కోసం గదులు, చివరిగా నౌకల్ని విధ్వంసం చేసే శతఘ్నులు చూసేసరికి నాకు నోటి మాట కరువయ్యింది. వాటిని కంప్యూటర్ యే విధంగా సెకండు తేడా లేకుండా ఖచ్చితంగా పేలుస్తుందో అక్కడి ఆఫీసరు చెప్తుకొచ్చేడు. బయటకు వచ్చేసర్కి చల్లటి గాలి, సువిశాలమైన సముద్రం దూరాన ఆకాశాన్నంటే భవనాలు చూసేసర్కి బొంబాయి మీద ప్రేమ వుట్టుకొచ్చింది.

జీపులో మమ్మల్ని మెయిన్‌గేటు దగ్గరకు తీసుకువచ్చాడు విస్సు. జీపు దిగి అందరమూ ముందుకు నడుస్తున్నాం. సెక్యూరిటీ మారింది కాబోలు వాళ్లంతా లేచి ట్రంపెట్ వాయిస్తూ సెల్యూట్ చేశారు. తలవంచుకొని ముందుకుపోతున్న విస్సు ఆ సెల్యూట్‌ని స్వీకరించలేదు. అయితే యెవరికి ఆ సైనిక వందనం? బయటికి వచ్చి అందరం టాక్సీ యెక్కి లాడ్జి వైపు బయల్దేరాం. విస్సుతో నా మనసులోని మాట బయటపెట్టా.

'మా నేవీలో కాని, మిలిటరీలో కాని, ఎయిర్ ఫోర్సులో కాని, మేం సెల్యూట్ చేసేది ఇద్దరికే. ఒకటి ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకి, రెండు స్త్రీలకి. ఆ గౌరవ వందనం మీ ఆవిడకేనోయ్ మిత్రమా' అన్నాడు. మా ఆవిడ కిసుక్కుమని నవ్వడంతో నేనీ లోకంలోకి వచ్చి పడ్డాను. చెప్పొద్దూ మహా సిగ్గేసింది నాకు.


ఎండ్లూరి సుధాకర్
'కొత్త గబ్బిలం'
త్వరలో..



విజయవాడ మరియు పరిసర ప్రాంత ప్రజలకు నూతన వైద్య సేవలందించటానికి డయాబెటిస్, రక్తపోటు, గుండె జబ్బుల చికిత్సలో విదేశాలలో 15 సం॥లు అనుభవంగడించిన ప్రముఖ వైద్యులు
డా॥ సూరపనేని రామబ్రహ్మం గారి
MBBS., D.P.Cardiology, P.G.C. Diabetes
Consultant - Diabetologist and Physician
ఆధ్వర్యములో
డయాబెటిస్ మరియు మెడికల్ సెంటర్
అన్ని సదుపాయములతో (డయాబెటిస్ ఎడ్యుకేషన్, లాబొరేటరీ, ఇసిజి, డాప్లర్, రూమ్ ఫెసిలిటీస్, 24 గం॥లు అందుబాటులో వైద్య సిబ్బంది)
విజయవాడ, రింగ్ రోడ్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, వినాయక థియేటర్ దగ్గర ప్రారంభించబడినది.
ఈ అధునాతన డయాబెటిస్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్వీసులను వినియోగించుకొనగలరు.
Ph: 0866-540826
TEJA PUB